# 86. వెండి అరిటాకు

**"లే**దు బావా, ఈ సారి తప్పు నాదే. నీతో నేను కూడా పోలీస్ స్టేషను కొచ్చి స్టేట్‌మెంటిస్తాను" అంటూ ఖాకీ పాంటూ షర్టూ ధరించిన ఆ యువతి ముందు కొచ్చింది. అది చూసీ వినీ; ఆ ఇద్దర్నీ పట్టుకుని కేసు బుక్ చేద్దామనుకున్న ట్రాఫిక్ కానిస్టేబుల్ నిర్ఘాంతపోయేడు.

పోలీసువాడేమిటి, ఎగిరెగిరి పడకుండా నిర్ఘాంతపడి నిమ్మకి నీరెత్తినట్టు నిలబడి వుండిపోవడమేమిటీ - అని జనం ఆ ట్రాఫిక్ జంక్షన్‌లో మూగుతున్నారు.

ఆటో వచ్చి మోపెడ్‌కి డాష్ కొట్టిందో, లేక మోపెడే ఆటో మీదికి దూసుకొచ్చిందో ఆ "మూమెంట్"లో ఎవరూ సరిగా చూళ్లేదు. వాళ్లిద్దరే చూసుండరు. సరిగ్గా చూసుకుని బళ్లు నడిపితే ఏక్సిడెంట్లెందుకవుతాయి?

అదలా వుండగా, ఇలాంటి సందర్భాల్లో ఒక జెనరల్ రూలుంది. నడిచేవాణ్ణి సైకిలు గుద్దితే సైకిలు వాడిది తప్పుట. సైకిలువాణ్ణి మోటార్ సైకిల్ గుద్దితే మోటర్ వాడిదే తప్పు. మోటర్ సైకిల్ని కారో జీపో గుద్దినా , కార్నో జీపునో లారీ గుద్దినా - ఎవరి వాహనం పెద్దదయితే వారిది తప్పు అవుతుంది. (రైళ్లకి ఇది వర్తించదు. )

వెనకటికి బాపుగారు ఒక కార్టూను వేసేరు. బోనులోంచి ముద్దాయి దిగి వచ్చి లాయరుతో అంటాడు : "ఇన్నికేసుల్లో ఇంతమంది ప్లీడర్లని సూసేనుగాని నీయంత మాటకార్ని సూళ్లేదయ్యా"- (బాక్‌డ్రాప్‌లో ఇద్దరు పోలీసులు జడ్జీగారికి అరదండాలు వేసి లాక్కుపోతూ వుంటారు.)

అలా, తప్పెవరిదో తెలియని ఆ పోలీసు సందిగ్ధంలోంచే జ్ఞానం తెచ్చుకుని విజిల్ గట్టిగా వూదేడు. లాఠీ ఆడించేడు. "ఎల్లండెల్లండి. ఎవరి పన్లమీద ఆళ్లెళ్లండి. నేనిక్కడున్నాను గనక సరిపోయింది గాని లేప్పోతే ఈళ్ల దగ్గిర వందో రొండొందలో లాగేసి కాంప్రమైజేసన్ జేసేద్దురు గావాల!" అని గొణిగేడు.

ఆ తరవాత పోలీసు స్టేషన్‌లో :-

"పేరు?"

"కె.పద్మ"

"వయసు?"

"ఇరవై ఆరు"

"బర్తపేరు?"

"పెళ్లవలేదు."

"తండ్రిపేరు?"

"వెంకటనారాయణ"

"వృత్తి?"

"ఆటో డ్రయివర్-కమ్-వోనర్".

"ఏటి ; మొన్న కలెక్టరు దొరగారు దోరాగా ఆటోలు రిసీవు జేసుకున్న పదేనుమంది లేడీ డయివోర్సులో నివ్వుకూడా ఉన్నావేటి?"

"లేదండి. నేను నా ఆటో బేంక్ లోన్ పెట్టి కొనుక్కున్నాను."

"నీ పేరేటబ్బాయ్?"

"ఆర్. శ్రీనివాసరావు. తండ్రి పేరు గంగాధరం. వృత్తి కె.ఎండ్.ఆర్.లో సేల్సు ఏజంటు. వయస్సు 29. అడ్రసు 39-26-42 రాజారావు వీధి."

"సర్లె, సర్లె. రాసి రాసి సేతులడి పోతున్నాయి గానీ, జరిగిందేటో మూడు ముక్కల్లో సెప్పు.... ఏటలా మొగాల్జూసుకుంటారు?'

"చెప్పు పద్మా."

"నువ్వే చెప్పు. నేనేం అడ్డురాను. నీకెలా చెప్పాలనిపిస్తే అలా చెప్పీ. వాళ్లు పెట్టమన్నచోట సంతకం పెట్టేసి వెళిపోతాను. నేనింకో అరగంటలో రెడ్డిగారి బంగళా దగ్గిరుండకపోతే పెద్ద బేరం పోతుంది."

"అఫెండరు ముందుగా స్టేట్‌మెంటివ్వడం ఎక్కడేనా వుందేమిటి?"

"లేదు. నువ్వే చెప్పు. తప్పు నాదే అని చెప్పేస్తాను."

"అది కాదు పద్మా. నేను నీ ఆటోని డేష్ కొట్టేనని చెప్పు. ఆటోకేమీ నష్టం రాలేదు కనక నీకేం అభ్యంతరం లేదని చెప్పు-"

"ఏయ్, ఏయ్! నేనిక్కడున్నానని మర్సిపోయి మీలో మీరే ఇకటాలాడేసుకుంటన్నారేటి, బావా మరదల్లలాగా?"

"యస్సార్. మేం అంతే సార్. అతను మా బావేనండి. అంటే - అదేనండి ; మా మేనత్త కొడుకండి."

అప్పుడు తెలిసింది వాళ్లిద్దరికీనీ; పోలీసులు కూడా మనసారా పకపకా నిష్కల్మషంగా నవ్వగలరని. ఆ అబ్బాయి చెప్పుకు పోతున్నాడు :

"అసలు మా ఇద్దరికీ పెళ్లి చెయ్యాలని పెద్దలు అనుకున్నారు సార్. కానీ, నాది ప్రైయివేటు కంపెనీ జాబ్ కదా అని పద్మ వొప్పుకోలేదండి. అప్పట్నించీ మా కిద్దరికీ పడ్డం లేదండి. మొట్టమొదటండి ; నేను ఆస్పటల్ డవున్‌లో రయ్యిమని సైకిల్ తొక్కుకొస్తుంటే మా పద్మ మెడికల్ షాపులోంచి పరిగెట్టుకొచ్చి నా సైకిలుకింద పడిందండి. రొండోసారి నేను మోపెడ్‌తో ఆసీలుమెట్ట డవున్ దిగుతుంటే ఆర్టీసీ కాంప్లెక్స్‌లోంచి సైకిలేసుకొచ్చి నాకు డేష్ ఇచ్చిందండి. ఆరోజు జనం పోగైనా దగ్గిర వందరూపాయలు లాక్కొని ఆడపిల్లకి డాష్ కొడతావా అని నన్ను తిట్టి పక్కనే వున్న వైట్ ఎలిఫెంట్ బార్లోకి వెళిపోయార్ సార్. ఇవాళా అంతేనండి. మెయిన్‌రోడ్‌లో నామట్టుకు నేను లెఫ్ట్ సైడు నుంచి మెల్లిగా వస్తుంటే సందులోంచి ఆటోలో వచ్చి నన్ను డేష్ కొట్టిందండి. ఏది ఎలాగైతేనేమండి? అరిటాకు మీద ముల్లు పడినా ముల్లుమీద అరిటాకు పడినా అరిటాకే కదండి చిరుగుతుంది! అలాగే తప్పెప్పుడూ నాదే అవుతోందండి."

పోలీసాయన ఇదంతా బాగా ఎంజాయిచేసి వాళ్లిద్దరికీ టీ తెప్పించి ఇవ్వడం దాకా వచ్చేడు.

అదయ్యాక "అసలు మీ కిద్దరికీ పెళ్లెందుకు కాలేదు?" అన్నాడు.

"చెప్పేను కాదండీ. నాకేమో నెలకీ తులం బంగారం విలువైన జీతం గానీ; లేకపోతే రెండేళ్ల గ్రాసం విలువైన బాంకెకౌంటుగానీ ఉండాలంటుందండి మా పద్మ."

"ఇప్పుడు నీ జీతం ఎంత?"

"2800 సార్. లోకల్ ట్రిప్పులకి పెట్రోలు కర్చులకింద కంపెనీ 500 ఇస్తే దాంట్లో 300 మిగుల్తాయండి. అయినాసరే తులంబంగారం జీతం లేదండి."

"ఏయ్ పిల్లా, ఇట్రా! ఈ కేసు రాయడం లేదుగానీ మీరిద్దరూ వోదెగ్గిర ఓ గంటపాటు స్తిమితంగా కూకుని లెక్కలేసుకుని; ఇంకా లేటైపోకముందే పెళ్లి జేస్కోండి. ఆ తరవాతుందే; మీరు వొకర్నొకరు డేష్ కొట్టుకొవాలనిపిత్తే ఆ బళ్లు ఇంటి కాడొగ్గిసి-"

అంతే. ఆ తరవాత పోలీసాయనకి నవ్వుతో పొలమారి మాట రాలేదు.

★

# 87. ఉద్యోగ యోగము

"**కం**గ్రాచులేషన్స్ మామయ్యా" అన్నాడు, నన్ను చూస్తూనే, మా మేనల్లుడు చలపతి. "దేనికి రోయ్?" అన్నాను. "నీక్కాదు, నాకు!" అన్నాడు. "నీకేదైనా మంచి జరిగితే నేను కదా కంగ్రాచులేషన్స్ అని చెప్పాలి! నువ్వే నీకు కంగ్రాచులేషన్స్ చెప్పుకుంటున్నావా?" అని మందలించబోయి మా బావగారి సంగతి గుర్తొచ్చి ఆగేను. మా బావగారు అప్పుడెప్పుడో చదువుకుంటూ వుండేటప్పుడు పద్యాలు రాసేవారు. ఆయన కాలేజిలో చదివిన నాలుగేళ్లూ ఆయన రాసిన పద్యాలు కాలేజీ మేగజైన్‌లో అచ్చువెయ్యడం అదంతా మా అక్కకీ ఆయనకీ పెళ్లి మాటలవుతున్న రోజుల్లో మేం తెలుసుకున్నాం. చిత్రం ఏమిటంటే చివరి రెండేళ్ల మేగజైన్స్‌లోనూ ఆయన పేరుకి ముందర "మధుర కవి" అని వుంది. "మీపూర్వులు కొన్నాళ్లు మధురలో ఉండేవారా?" అని నేను అడిగేను. "అబ్బే లేదు; మధురకవి అంటే తియ్యటి కవిత్వం రాసే కవి అన్నమాట. అది ఒక బిరుదు" అన్నారాయన. "ఎవరిచ్చేరు మీకు ఆ బిరుదు?" అని నేను అడక్కుండానే ఆయన అటూ యిటూ దొంగచూపులు చూసి "ఎవరైనా నాకు బిరుదు లివ్వడం , సన్మానాలు చెయ్యడం నాకు ఇష్టం వుండదు. అంచేత నేనే-"

మా మేనల్లుడు చలపతి అంటే మా(ఆ) బావగారి కొడుకే కదా. అంచేత వాడికి ఏదో 'మంచి' జరిగిందన్న సంగతి విన్నా నేను అభినందిస్తానో లేదో అని తనే స్వయంగా కంగ్రాచు లేషన్స్ చెప్పుకున్నాడన్నమాట.

ఇంతకీ చలపతి తనని తాను అభినందించుకోడం ఎందుకుటా అంటే; వాడు "నిన్న" మధ్యాన్నం మూడుగంటలకి (పార్వతీపురం నుంచి) విశాఖపట్నం వచ్చేడట. నాకోసం మా ఇంటికి వెళ్తే "ఇప్పుడే బయల్దేరి వెళ్లేరు. గోదావరి ఎక్స్‌ప్రెస్‌లో హైదరాబాదు వెళ్తున్నారు" అని